# ప్రకంపనం

ఆకాశంలో విమానం మండుతూ దూసుకుపోతోంది మంటలు.. మంటలు... భళ్ళుమన్న మంటలు.

మైగాడ్...

హో... మైగాడ్... అల్లల్లాడుతోన్న ప్రయాణీకులు.

భుజంపై బిగుసుకుంటున్న చేతివేళ్ళు తలతిప్పి చూద్దామన్నా తల కదలట్లేదు.

'కిటికీలు మూసైయండి' ప్రకటన.

'యెక్స్‌క్యూజ్ మీ మేడమ్' అంటూ యెయిర్ హోస్టెస్ షట్టర్ మూసేసింది.

కానీ నా కళ్ళల్లోంచి ఆ మంటలు చెదిరిపోలేదు మా విమానానికి యేటవాలుగా కిందగా సాగిపోయి భళ్ళుమన్న మంటలు...వొక్కరు కూడా బ్రతికివుండే అవకాశం వుందా...సూపర్ సానిక్...జెట్...జింబో...

'భయపడకండి...వాతావరణం బాగుంది...స్మూత్‌గా సాగుతోంది అన్నీ బాగున్నాయి' మృదువుగా పైలెట్ స్వరం.

వెనకనుంచి యెవ్వరో గట్టిగా ప్రార్థిస్తున్నారు. కాస్త బి.పి పెరిగిన వాళ్ళ కోసం యెయిర్‌హోస్టెస్ డ్యాక్టర్ యెవరైనా వున్నారేమోనని వెతుకుతోంది. గుండెల్లో నొప్పి... కడుపులో తిప్పుతోంది.

నా భుజంపై చెయ్యి అలానే బిగుసుకొని వుంది తలతిప్పి చూసా.

బిగుసుకుపోయిన శరీరం

సందేహం...అనుమానం...బటన్ ప్రెస్ చేసా...

యెయిర్‌హోస్టెస్ వచ్చింది.

'మైగాడ్'...అంటూ శరీరాన్ని కదిపింది. కుప్పకూలింది.

ట్రాజిడి...యాక్సిడెంట్ పాతటిక్...అభిప్రాయాల వెల్లువ...

యిట్స్ వెరి నేచరల్...వీళ్ళందరికి నేచరల్ అనిపించటం లేదా?!

తీవ్రత సోకదా....

చాలా దూరం ప్రయాణించాలి బాధాకరమైన యీ మొత్తం నుంచి బయటకి రావాలి.

'యెక్స్‌క్యూజ్‌మి మేడమ్ మీ సీట్ మార్చుకుంటారా' ఎయిర్‌హోస్టెస్ అడుగుతోంది.

పక్కకి చూసా సీట్ ఖాళీ.

సీట్ మార్చుకుంటే యేమవుతుంది మనసునే మార్చుకోవాలి. వీలైతే నిర్మానుష్యమైన యీ మనసుని.

'థాంక్ యూ... యిక్కడే కూర్చుంటా' చెప్పాను.

యీసారి నా యిండియా ట్రిప్ అంతా యెదురు చూడనివే నిండిపోయాయి. న్యూయార్క్‌లో ఫ్లైయిట్ యెక్కినప్పట్నుంచి యెప్పుడెప్పుడు యిండియాని వొక్కటే చూపు అమ్మామ్మవాళ్లని యెంత త్వరగా చూస్తానా? యి-మెయిల్ చాట్ వున్నప్పటికీ వాళ్లని చూడాలని ఆత్రం యెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది.

విమానం లాండ్ అవ్వటంతోనే తలుపు దగ్గరకి వచ్చేసా మర్యాద కాదని తెల్సినా.

బ్యాగేజి దగ్గరకి వెళ్లకుండా లాంజ్ దగ్గరకి వచ్చాను. యెవ్వరూ కనిపించలేదు. వో నిముషం తర్వాత డ్రైవర్ కనిపించాడు.

'మమ్మీవాళ్లు'...

'రాలేదమ్మా'

'బాగున్నారా'

'ఆ'

'అంతా'

'ఆ'

'యెందుకు రాలేదు' అని వెంకయ్యని అడగలేక బ్యాగేజ్ తీసుకొని బోకేలతో సాటి ప్రయాణీకుల ఆప్తుల కోలాహలాన్ని దాటుకొని వస్తుంటే నిజంగానే అంతా బాగున్నారా? యెందుకు రాలేదు? యెప్పుడూ యిలా రాకుండా లేరే? యెన్ని మీటింగ్స్ వున్నా యెంత పని వొత్తిడిలోనైనా డాడి వచ్చేవారు. మమ్మీ అసలెప్పుడూ రాకుండా వుండదు యేమైయిందో?!

కారు యెక్కాను.

'కొత్త ఫ్లైవోవర్ యిదేనా'

'చాల ఫ్లైవోవర్లు వచ్చాయమ్మ. యిలా రోడ్డు వేస్తునే అలా తిరిగి తారు వేస్తున్నారమ్మ'

'వూహు'

కారు దిగి యింట్లోకి వెళుతుంటే మాలి పలకరించాడు హాల్లోకి అడుగుపెడుతుంటే 'హా బేబీ'... మమ్మీ యెదురొచ్చింది. వెనకే పూజ గదిలోంచి డాడి కనుబొమ్మల మధ్య కుంకుమతో. వోహగ్. వో ముద్దు.

'అచల్ యెప్పుడొస్తున్నారు'

'వచ్చేవారం'

'రా బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం'

'యేంటీ రోజు'

'యిడ్లీ... దోశ... ఉప్మా...'

'వ్వా... రా... రా... నీలమ్మ వంట భలే చేస్తుంది. చిట్టి చిట్కాలన్నీ అమ్మ నీలమ్మకి నేర్పించింది. మా చిన్నప్పుడు అమ్మ వంట చేసేది. రాను రాను అమ్మ అజమాయిషీతో వంట జరుగుతుండేది. యింటికి యెవరు యే వేళప్పుడు వచ్చినా రెండుమూడు రకాలతో వడ్డించేది అమ్మ.

టేబిల్‌పై పద్ధతిగా సర్దున్నాయన్ని. వాటి రంగు రూపం మాత్రం హోటల్‌వి.

'హోటల్‌విలా వున్నాయి'

'హో. హోటల్ నుంచే. రోజూ బ్రేక్‌ఫాస్ట్ మినర్వా నుంచి. లంచ్ విజయవాడవాళ్ల హోటల్ నుంచి కాని భీమవరం వాళ్ల నుంచి కానీ తెప్పిస్తున్నాం. డిన్నర్ గుంటూరు వాళ్లదో నెల్లూరివాళ్లదో. అన్నింటి నుంచి హోమ్‌డెలివరీ వుంది. అప్పుడప్పుడు క్లబ్స్‌కి వెళ్లటం. యెప్పుడైనా యింట్లో వండుతున్నాం అమ్మ చెపుతోంది.

అమ్మా నాన్నలతో రెండ్రోజులు గడిపేసరికి లోపం నాలోనా వాళ్లలోనా యింకేదైనా వుందా అనిపించింది. యేదో మిస్సింగ్. అమ్మ యేడుకో తొమ్మిదికో నిద్రలేస్తుంది. టి.వి. ఫోన్... బ్యూటి పార్లర్ అమ్మాయో మసాజ్ అమ్మాయో వస్తారు. గోల్డ్ ఫేషియల్, ప్లాటినమ్ ఫేషియల్, మసాజ్ స్టీమ్ బాత్... అలసట... గ్లాసుతో ఫ్రూట్ జ్యూస్... తిరిగి టి.వి.

'పార్లర్‌కి వెళ్లటం మానేసావా'

'ఆ యింటికి వచ్చి చేస్తున్నారుగా'

'పీజా ఆర్డర్ చేసా. రాత్రికి ఫిష్ తింటావా'

'ఆ'

'నెల్లూరి వాళ్లదా... భీమవరందా'

'యేదీ వద్దు యింట్లో చేద్దాం'

'యింట్లోనా'

'వూ'

'యెందుకు'

'బోర్ కొడుతుంది జస్ట్ ఫర్ ఛేంజ్'

'బోర్ కొడితే షాపింగ్‌కి వెళదాం'

'నో షాపింగ్. వంట చేద్దాం' వంటింట్లోకి వెళుతూ 'కావల్సిన సామాను తెప్పించు' అన్నా.

డాడీ రోజూ పూజ చేయటం పేపర్ చదవటం కాసేపు టి.వి నిద్ర తిరిగి టి.వి... డాడీ ఆఫీసుకి వెళ్లటం చూడలేదు.

'యేం డాడీ ఆఫీసుకి వెళ్లటం లేదు'

'యే ఆఫీసుకి వెళతారు? ఫ్యాక్టరీలన్నీ అమ్మేసాం కదా'

'యిప్పుడు డాడీకి యేం పనిలేదా?'

'శుభ్రంగా వున్నారు యే టెన్షన్స్ లేవ్. మంచి రేట్ వచ్చింది' మమ్మీ చెపుతోంది.

ఫ్యాక్టరీలని అమ్మటం తెలుసు కాని యిలా యే పని లేకుండా వున్నారనే తలంపే రాలేదు. కొత్త వ్యాపారం మొదలు పెట్టొచ్చు కదా.

'డాడీ డిన్నర్‌కి రండి'...వేడి వేడి అన్నం ప్లేట్‌లో వడ్డిస్తూ పిలిచా.

పులుసు భలే వుంది...

కాకరకాయలో వుప్పు తక్కువైయింది...

నే చేయలేదు మమ్మీ చేసింది.

మజ్జిగపులుసులో తాలింపు అదిరింది.... నేనే చేసా....

డైనింగ్ టేబిల్ దగ్గర రుచిరుచిగా ఘుమఘుమలాడే మాటలు పరిహాసాలు.

తిరిగి వుదయం డైనింగ్ టేబిల్ దగ్గర నిశ్శబ్దం. హోటల్ తిండి... నో కామెంట్స్.

సాయంత్రం డాడీని తీసుకొని డ్రైవ్‌కి వెళ్లాను.

ఫ్యాక్టరీ యెందుకు అమ్మేసారు డాడీ.

'మంచి రేట్ వచ్చింది'

'అసలు అమ్మాలనే ఆలోచన యెందుకు వచ్చింది? దగ్గరుండి కట్టించారు

మీకు చాలిష్టం కదా'

'మరో మార్గం లేదు. చాల ఫ్యాక్టరీలని వాళ్లు కొనేసి సరుకు రేట్ తగ్గించేసారు. ఆ రేట్‌కి మనం యివ్వలేం. ప్రొడక్షన్ కాస్టే ఆ రేట్ కంటే యెక్కువ వుంటుంది. మార్కెట్‌లో నిలబడటం కష్టం. అమ్మేస్తే అంతోయింతో లాభం. మొత్తం ఫ్యాక్టరీలు వాళ్ల చేతికొచ్చాక రేట్ బాగ పెంచేసారు. లేని కొరతని క్రియేట్ చేయటం. బాగా లాభాలు వాళ్లకి'

'వాళ్లని రానివ్వకూడదు'

'వస్తే యేమయింది. వాళ్లు రావాలని మేం అంతా కోరుకున్నాం. బాగా డబ్బులిచ్చే కొన్నారు ఫ్యాక్టరీలని'

'యు ఆర్ నాట్ మిస్సింగ్ యెనిథింగ్ డాడీ'

'మిస్సింగ్?!...' ఆయన నవ్వారు వెలితిగా

'మీకేం పని లేదు. బోర్ కొట్టటం లేదూ? ఆ మిషన్సు ప్రొడక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ మీటింగ్స్ - ఫైనాన్షియల్ యిన్‌స్టిట్యూషన్స్ యెప్పుడూ బిజీ బిజీగా లైవ్‌లీగా వుండేవారు కదా. యే పనీ లేకపోవటం బోర్‌గా లేదు' కారు మేడ్చల్ రోడ్డులో దాబాలని దాటి ముందుకు వెళ్లేసరికి కాస్త ట్రాఫిక్ తగ్గి స్పీడ్ పెంచడానికి వీలుగా అనిపించింది. యే.సి. ఆపి కారు అద్దాలు దించాను. డాడీ తనవైపు అద్దం దించుతూ 'మంచిగాలి...' అని ఆగి 'పిచ్చిబోర్‌గా వుంది. వ్యాక్యూమ్ యెక్కువ అవ్వగానే మెడిటేషన్ చేసి మైండ్‌ని కంట్రోల్లో పెట్టడానికి ప్రయత్నిస్తున్నా' చప్పున చెప్పేసి నిశ్శబ్దమైపోయారు.

'యేదైనా బిజినెస్ మొదలు పెట్టొచ్చుగా'

'యిక్కడా? అంత పెద్ద ఫ్యాక్టరీని నడిపి యిప్పుడు చిన్నచిన్నవి యేం మొదలుపెడతాం. అంతా నవ్వుకోరు?'

'సాఫ్ట్‌వేర్'

డాడీ మాట్లాడలేదు.

'అక్కడికి రండి. యేదైనా మొదలుపెట్టొచ్చు'

'అదే ఆలోచిస్తున్నా. కానీ మీ అమ్మకి అక్కడికి పూర్తిగా షిఫ్ట్ అవ్వటం యిష్టం లేదు. యిక్కడ సర్కిల్‌ని మిస్ చేసుకోదంట. ప్రపంచంలో యెక్కడైనా వ్యాపారం చేసుకోవచ్చనే అవకాశం వుంటే బాగుండునని క్లబ్స్‌లో యెన్నోసార్లు మేం అనుకునేవాళ్లం, రావాలని గట్టిగా కోరుకున్నాం. దారులు పూర్తిగా వోపెన్ చేసినట్టే

వుంది కానీ యీ యిరుకేంటో అర్థం కావటం లేదు' డాడీ స్వరంలో నిస్సహాయత, అసహనం.

'అచల్ రేపు వస్తున్నాడు కదా. అతని బిజినెస్ యెలా వుంది' అడిగారు.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. డాడీలోని స్తబ్దత మనసుని మెలిపెడుతోంది. నిర్లిప్తమైన డాడి చూపులు.... నిలకడలేని మమ్మీ చూపులు... బెంగగా అనిపించింది. గదిలోంచి బయటకి వచ్చాను. అమ్మ టి.వి. చూస్తుంది. అమ్మ వొడిలో తలపెట్టుకొని పడుకున్నా. అమ్మ చేతివేళ్లు నాతలని నిమురుతాయని చూసా. వూహూ రిమోట్‌ని వదలటం లేదు.

యెయిర్‌పోర్ట్‌కి వెళ్లి అచల్‌ని తీసుకొచ్చా. యింటికి వస్తూనే డాడితో సిలికాన్‌వ్యాలి పెట్టుబడి లాభం నష్టం మాటల్లో పడిపోయ్యాడు.

మధ్యాహ్నం టీ తాగుతూ అంతా హాల్లో కూర్చున్నాం. అమ్మ యథాప్రకారం ఛానల్స్ మారుస్తునే వుంది. చప్పున వో చోట ఆపింది.

జనం... పోలీసులు... రాళ్లు... తుపాకీగుళ్లు... లైవ్‌లో ప్రాణం తీయటం... పోగొట్టుకోవటం... గగ్గురుపాటు...

నోట్లో టీ గొంతు దిగటం మర్చిపోయింది.

మమ్మీ డాడి అచల్ అతని ఆమ్మానాన్న ఆ విషయాన్నేం పట్టించుకోవటం లేదు. వొక్క క్షణం అలా చూసి తిరిగి కబుర్లు. ఛానల్ చేంజ్.

'మైగాడ్... వాట్సదిస్...' మాటలు బయటకి వచ్చేసాయి.

అచల్ కొద్దిగా చూపులు తిప్పి 'యిట్స్ వెరి కామన్' అన్నాడు.

'యేది'

'నువ్వు తప్ప అన్నీ కామనే. నువ్వెందుకలా అన్నింటికి అలా గిలగిలలాడతావ్' నవ్వుతున్నాడు అచల్.

ఆ రాత్రి -

అచల్ నా మెడపై జుట్టుని పక్కకి మెల్లగా తీస్తూ ముద్దుపెట్టుకున్నాడు. అచల్‌కి ఆ ముద్దుని నేర్పింది నేనే. ఆ జలదరింపు నాకెంతో యిష్టం. ఆ మత్తులో అలా నిద్రలోకి జారుకోవటం... ఆ మగత యెంత మోహమో... కానీ యిప్పుడెందుకో భయం వేసింది. కళ్ల ముందు ప్రాణాలు పోగొట్టుకుంటున్న వాళ్లని చూసి 'యిట్స్ వెరి కామన్' అని నమ్ముతున్న అతని స్పర్శకి నా శరీరం వెచ్చదనాన్ని సంతరించుకోవటం లేదు.

'ఫైర్ తగ్గింది నీలో. పెళ్లయిన కొద్ది కాలానికే మీలో ఫైర్ తగ్గిపోతుందేం? మాకు అలా కాదు. అందుకేనేమో మేం వేరే వేరే శారీరక సంబంధాల్లోకి త్వరగా వెళ్లిపోతాం' అన్నాడు.

సిగరెట్టు వెలిగించి నాలుగైదు ఫప్స్ తీసి వదుల్తూ 'మేబి యిట్స్ ఆల్సో వెరి కామన్' అన్నాడు.

నవ్వు పగిలింది.

'గోవా వెళదామా' అడిగాడు

'యెందుకు'

'నాలుగు రోజులు ఖాళీ దొరికింది. ఫ్రెండ్స్ అంతా ఫ్యామిలీస్‌తో వెళదాం అనుకుంటున్నాం'

'నాన్నమ్మ యింటికి వెళదామా'

' ఆ వూరా బోర్. దుమ్ము. వద్దులే'

'బోరా... నాన్నమ్మ తాతగారు పెద్దనాన్న పిన్నమ్మలు... పోదాం' అన్నా.

'ముసలివాళ్ల దగ్గరకి వెళతానంటావేంటి. రాను. వెళితే వెళ్లు. నే గోవా వెళతా' అన్నాడు.

'సరే'

గోదారి పాయల నడుమ నుంచి కారు సాగిపోతుంది. పచ్చని చేల గాలులు కొబ్బరితోటల నడుమ నాలుగు అడుగులేస్తే మండువ లోగిలి.

'బొత్తిగా కనిపించటమే లేదు మీ అమ్మానాన్న. మీ ఆయనెలా వున్నాడు? స్నానం చేస్తావా? యేమైనా విశేషమా? నీ వుద్యోగం యెలా వుంది?' నాన్నమ్మ వేడివేడి కాఫీ అందించి ప్రశ్నలే ప్రశ్నలు.

'వుద్యోగం చేస్తున్నావంట కదా' నాన్నమ్మ అడిగింది.

'వూ'

'పనసపొట్టు కూర తింటావా'

'అదేంటి నాన్నమ్మ? నాకు చాలిష్టం కదా'

'యిష్టం పోవచ్చు కదా. యేళ్ల తరబడి వుంటున్న యిళ్లపై సాగు చేస్తున్న భూమిపైనే ముసలాళ్లకీ మమకారం పోయింది. ప్రలోభానికి లొంగిపోతున్నారు. యింక మీరెంత? యీ రుచులెంత' నిష్ఠూరంగా నాన్నమ్మ అంది.

'యేమయింది నాన్నమ్మ'

'కొబ్బర బోండాలు దించే వాళ్లొచ్చారు' పాలేరు చెప్పాడు.

నాన్నమ్మ బయటకి వెళ్లి వాళ్లకి పని పురమాయించింది. తోటలోంచి వచ్చిన కూరగాయలని చూసి యెవరెవరికి యేం పంచాలో చెప్పింది. నాన్నమ్మ కాలుపై కాలేసుక్కూర్చున్నా పనులు అయిపోతాయి. నెయ్యి మరగపెట్టటం నుంచి అన్నింటిని దగ్గరుండి చేయటమో చేయించటమో. యింట్లో వాళ్ల అవసరాలు అన్నింటికి అటెండ్ అవుతుంది. ఆ కూరగాయ తోటలు, కొబ్బరి తోటలు పూలతోటలు పాడిపై మొత్తం అజమాయిషి ఆవిడదే. వుదయం ఐదు గంటలకి నిద్ర లేచిన ఆవిడ రాత్రి పడుకునేవరకు గిర్రున తిరుగుతూ పనులని చేస్తూనే వుంటుంది. కష్టం సుఖం చెప్పుకోడానికి వచ్చే ఆడవాళ్లు మగవాళ్లు... నాన్నమ్మ యెప్పుడూ యింత నిష్టూరంగా మాట్లాడటం నే వినలేదు.

సాయంకాలం తోట వైపు వెళ్లాను సాయంకాలపు నీరెండకి విచ్చుకుంటున్న బీరపూల పచ్చదనం కనుచూపు మేరంతా. ఆకుపచ్చ నీలిమ అంచులా కొండలు. మిరపనారుని యెప్పుడు పోయాలో చెపుతోంది.

'బోల్డన్ని జాజిపూలు పూసాయి. మాల కడదాం. కోద్దామా' అడిగింది నాన్నమ్మ.

పూలు తీసుకొని యిద్దరం వస్తుంటే 'నీ తలకట్‌ని యేమంటారు' అడిగింది.

'మష్రూం కట్'

'మష్రూం కట్... బాగుంది పేరు. మీకు పనికి మనుషులు దొరకరంట కదా పనంతా యెవరు చేస్తారు' అడిగింది.

'యిద్దరం కలిసి చేసుకుంటాం' అన్నాను

'నీకక్కడ బాగుంటుందా'

'బాగుంటుంది.'

'అక్కడ ప్రేమలుండవు యెవరిని యెవరు పట్టించుకోరంటారు. నిజమేనా?' నాన్నమ్మ అడిగింది.

'యెక్కడైనా ప్రేమా వుంటుంది. కన్‌సర్న్ వుంటుంది. వాటి కోసం తపనపడే మనసుండాలి కానీ. యిక్కడ సాటి మనుష్యులపై ప్రేమా కన్సర్న్ తగ్గటంలేదా. అచల్ నాక్కాస్త తలనొప్పి వస్తే గిలగిలలాడతాడు. అటువంటి అచల్ కళ్ల ముందు ప్రాణాలు పోగొట్టుకుంటున్న వ్యక్తి పట్ల మామూలుగా వుంటాడు. పైగా కామన్

అనుకుంటాడు. అచల్లో ప్రేమించే మనసు వుందనాలా లేదనాలా? నా ఆస్తిని జాగ్రత్తగా పెంచి పోషించటం నాకిష్టమని పొలకోవాని అక్కడికి యెవరొస్తే వాళ్లతో పంపించటం యెలా వున్నావని తరచూ ఫోనో మెయిలో చాటో చేసి కనుక్కునే మనిష్మిడాడి... నేనొస్తుంటే యెయిర్‌పోర్ట్‌కి రాలేదు. అంతమాత్రాన నా పట్ల వాళ్లకి యిష్టం లేదనుకోలేను కదా. ఆ సమయంలో యెందుకు రాలేదనే బాధ వుంటుంది. కానీ వొక్కో సంఘటన జరిగిపోతుంటే అన్నిటిలోని లోతు తగ్గిందనిపిస్తుంది' అన్నాను.

'మీ అమ్మానాన్న విషయం చెప్పకు. వద్దంటుంటే వినకుండా ఫ్యాక్టరీ పెట్టారు. వ్యవసాయం వద్దనుకున్నారు. చదువుకున్న పిల్లలు వాళ్లిష్టం అనుకున్నాం. ఆ ఫ్యాక్టరీని యెంచక్కా నడిపేవాడు. చెప్పాపెట్టకుండా వో రోజు అమ్మేసాడు. పేపర్లో చూసేవరకు తెలియనే లేదు. పని లేదు వాళ్లిద్దరూ యెంత సోమరిగా తయారయ్యారంటే వండుకోవటం కూడా మానేసారు. యిప్పుడు మీ తాతయ్యగారేమో బంగారంలాంటి పొలాన్ని అమ్మేస్తానని పేచి. పైగా మిగిలిన రైతుల్ని అమ్మటానికి వొప్పించారు. ఆ డబ్బువస్తుంది అంటారే తప్ప నేలకి మనం దూరం అవుతామన్న జ్ఞానమే లేదు. నేనైతే చెప్పేసాను. గోళ్లు గిల్లుకుంటూ బతకలేను. పొలంలో నా వాట నాకు యిచ్చెయమన్నాను. యిన్నాళ్ల నుంచి పెంచి పోషించిన నేలయిది. అసలు వొక్కరోజు యిటు రాకుండా వుండలేను' నాన్నమ్మ చెపుతోంది వింటుంటే కాళ్లపై రోకలిబండ పాకుతోన్న అనీజి.

పొలమంతా తాతయ్య పెద్దనాన్న డాడి చిన్నాన్న పేర్లమీదే వుంది. తన పేరున యింత పొలం కావాలని నాన్నమ్మ యెప్పుడూ అడగలేదు. యిప్పుడామె తన వాటాని అడుగుతుంది. వాళ్ల కింద పనిచేయటానికి కానీ పని లేకుండా వుండటానికి కానీ ఆమె సిద్ధంగా లేదు. ఆమె తాతయ్యకి పిచ్చిదానిలా కనిపించొచ్చు కానీ నాన్నమ్మ యెంత గొడవకైనా సిద్ధంగానే వున్నట్టు కనిపిస్తోంది.

నాన్నమ్మ భుజాల చుట్టూ చేతులేసి 'గోరింటాకు పెట్టవా' అడిగాను.

గోవా నుంచి అచల్ వచ్చేసరికి పండిన గోరింట చేతులతో అమ్మా వాళ్ల యింట్లో అటూయిటూ తిరుగుతున్న నన్ను చూసి 'టికెట్స్ కన్‌ఫర్మ్ అయ్యాయా' అని అడిగాడు.

'అయ్యాయి'

'చిన్న మార్పు. నే వయా లండన్ వద్దామనుకుంటున్నా. చిన్న పనుంది.

నువ్వూ వస్తావా డైరెక్ట్‌గా వెళ్లిపోతావా' అడిగాడు నా చేతుల్ని ముద్దుపెట్టుకుంటూ.

'లీవ్ సమస్య. డైరెక్ట్‌గా వెళ్లిపోతా' ట్రావల్ ఏజెంట్‌కి ఫోన్ చేసి చెప్పాను.

రెండ్రోజుల్లో ప్రయాణమనగా భూకంపం వచ్చినట్టు ధడ్ ధడ్ లాడుతూ తాతయ్య. వెనక నిదానంగా నాన్నమ్మ.

'యిన్నాళ్లు మీ అమ్మకి విమెన్స్‌లిబ్ గాలేదో సోకిందనుకునేవాడిని. యిప్పుడు యేకంగా ఫెమినిజం వొంట బట్టింది. పొలంలో తన వాటా తనకి యివ్వకపోతే కోర్టుకి పోతుందంట' నిదానంగా నవ్వుతూ చెప్పారు.

మమ్మీ డాడీకి కాసేపటికి ఆవిడ గట్టిగా తీసుకున్న నిర్ణయం అని అర్థం అయింది.

'యెందుకమ్మా నీకా గోలంతా? యెంచక్కా కొన్నాళ్లు ప్రపంచమంతా తిరిగిరా. శర్మిష్ట యింటికి వెళ్లు. యేరా నాన్నమ్మకి డిస్నీలాండ్ వెంకటేశ్వరా టెంపుల్ చూపిస్తావా?' అడిగారు నన్ను.

వాళ్లందరినీ చూస్తున్నా.

'అక్కడికి వెళితే రావాలనిపించదు. వెళ్లండత్తయ్యా. శర్మిష్ట యిల్లు భలే వుంటుంది. అచల్ ఆఫీసు బిల్డింగ్ చూసే కళ్లు తిరుగుతాయి' మమ్మీ చెపుతోంది.

'నాకేం వద్దు. పొలం కావాలి' నాన్నమ్మ కచ్చితంగా చెప్పేసింది.

'పోనీ నాది తీసుకోమ్మా' డాడీ అన్నారు.

'అదెలా వీలవుతుందిరా? వాళ్లకి ఆ మొత్తం కావాలి. నీదేమో మధ్యలో వుంది. అయినా నీకూ మతిపోయిందా? ఆవిడకి పొలం యెందుకంట' తాతయ్య అడ్డుతగిలారు. ఆ వ్యవహారం తెగేట్టులేదు.

యేం తేలకుండానే మేం యింట్లో బయలుదేరాం. ఎయిర్‌పోర్టుకి అంతా వచ్చారు.

'శర్మిష్ట నీకు తెలిసిన లాయర్ యెవరైనా వుంటే చెప్పమ్మా' నాన్నమ్మ అడిగింది.

వో కాగితంపై పేరు టెలిఫోన్ నెంబర్ వేసిచ్చి 'నా క్లాస్‌మేట్ వాళ్ల నాన్నగారు లాయరే. అక్కడికి వెళ్లాక నేనూ మెయిల్ చేస్తా తనకి. నీకేమైనా కావలిస్తే ఆమెకి చెప్పు. నాకు మెయిల్ చేస్తుంది' నాన్నమ్మ షేక్‌హేండ్ కోసం చాయి చాచాను.

నాన్నమ్మ పెట్టిన గోరింటాకు మెరుస్తోంది. ఆ మెరుపు చూస్తూనే ఫ్లైయిట్ యెక్కాను.

* * *

'ఎక్స్‌క్యూజ్‌మీ మేడమ్ సీట్ బెల్ట్'

తలెత్తి చూసా. ఎయిర్ హోస్టెస్. 'లాండింగ్ ఎనౌన్స్‌చేసారు' అందామె. పైలెట్ భరోసా యిచ్చినట్టే సేఫ్ లాండింగ్. యింటికి చేరుకొని వారం అవుతోంది. అచల్ యింకా లండన్‌లో తిరుగుతూ మధ్యలో వోసారి కాల్ చేసి 'నీకోసం తులీఫ్స్ తెస్తున్నా' అన్నాడు.

న్యూస్ చూస్తున్నా.

ఆకాశంలో మంటలు విరజిమ్మిన ఆ కోవకి చెందిన విమానాలన్నింటిని నిలిపివేస్తున్నట్టు వార్త... వివరాలు... టెలిఫోన్ మోగింది.

మమ్మీ.

'మీ నాన్నమ్మ కేస్ వేస్తానన్నారు కదా. తాతయ్యగారికి ఆవిడని వొప్పించలేక కోపం వచ్చేసింది. యిద్దరూ బాగా అరచుకున్నారు. వాళ్లిద్దరి మధ్య గాప్‌ని యెప్పుడూ చూడలేదు' మమ్మీ దిగులుగా చెప్పుకుపోతోంది.

టి.వి.లో ఆ విమానాలపై సంభాషణ నడుస్తూనే వుంది. మనుష్యుల మధ్య రగిలే మంటలకి కారణమైన వాటిని యెవరు ఆపుతారు? నిషేధిస్తారు?

మనసంతా నిర్మానుష్యంగా వుంది...

❖